RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 329 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | శనివారం, 1 జూన్ 2024 | పేజీలు : 4 | వెల : 2/-




# నేడే తుదిపోరు

## 57 లోక్‌సభ సెగ్మెంట్‌లకు పోలింగ్

## 8 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతంలో ఎన్నికలు

## బరిలో మొత్తం 904 మంది అభ్యర్థులు

## వారణాసి నుంచి మోదీ, మండి నుంచి కంగనా పోటీ

న్యూఢిల్లీ: లోక్‌సభ ఫైనల్ ఫేజ్ ఎన్నికలు శనివారం నిర్వహించేందుకు ఈసీ ఏర్పాట్లు చేస్తున్నది. చిట్టచివరి ఏడో దశ ఎన్నికల ప్రచారం గురువారం సాయంత్రంతో ముగిసింది. 8 రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంతో కలిపి మొత్తం 57 లోక్‌సభ నియోజకవర్గాలకు పోలింగ్ జరగనున్నది. యూపీలో 13, పంజాబ్‌లో 13, బిహార్‌లో 8, బెంగాల్?లో 9, హిమాచల్‌ప్రదేశ్‌లో 4, ఒడిశాలో 6, జార?ండ్?లో 3, చండీగఢ్‌లో ఒక లోక్?సభ స్థానానికి ఎన్నికలు నిర్వహిస్తున్నారు. మొత్తం 904 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. పంజాబ్ నుంచి 328 మంది, యూపీ నుంచి 144 మంది, బిహార్ నుంచి 134 మంది, ఒడిశా నుంచి 66 మంది, జారండ్ నుంచి 52 మంది, హిమాచల్‌ప్రదేశ్ నుంచి 37 మంది, చండీగడ్ నుంచి నలుగురు పోటీలో ఉన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల దాకా పోలింగ్ ఉంటుంది. ఈ ఫేజ్‌లో ప్రధాని మోదీ పోటీ చేస్తున్న వారణాసి సెగ్మెంట్‌కు కూడా ఎన్నికలు జరగనున్నాయి. ఇదే సెగ్మెంట్ నుంచి కాంగ్రెస్ తరఫున అజయ్ రాయ్ పోటీ చేస్తున్నారు. అదేవిధంగా మండి నుంచి బీజేపీ తరఫున కంగనా రనౌత్, కాంగ్రెస్ నుంచి విక్రమాదిత్య సింగ్ బరిలో ఉన్నారు.



## ఉత్తరాదికి ఎండదెబ్బ.. ఒక్క రోజులో 50 మంది మృతి

దేశవ్యాప్తంగా భానుడు భగభగమంటున్నాడు. వారం రోజులుగా ఉత్తరాదిన 50 డిగ్రీల సెల్సియస్ వరకు రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు నివేదికలు వస్తున్నాయి. దిల్లీ, రాజస్థాన్, బిహార్, యూపీతోపాటు మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో వడదెబ్బల ధాటికి అనేకమంది పిట్టల్లా రాలిపోతున్నారు. గత 24 గంటల్లోనే దేశవ్యాప్తంగా 50 మందికి పైగా చనిపోయినట్లు అంచనా. బిహార్‌లో ఒక్కరోజులో 14 మంది చనిపోగా.. అందులో పది మంది పోలింగ్ సిబ్బంది ఉన్నారు.

రాజస్థాన్‌లోనూ పదుల సంఖ్యలో మరణాలు నమోదవుతున్నాయి. ఈ సంఖ్య 100 దాటిందని విపక్షాలు, నిపుణులు ఆరోపిస్తున్నారు. బిహార్‌లో అనేకచోట్ల రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బక్సర్‌లో గురువారం 47.1 డిగ్రీలు నమోదయ్యింది. వడదెబ్బ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 24 గంటల వ్యవధిలోనే 14 మంది చనిపోయినట్లు అక్కడి విపత్తు నిర్వహణ విభాగం వెల్లడించింది.

వీరిలో 10 మంది పోలింగ్ సిబ్బంది ఉన్నారని తెలిపింది. అయితే, వడదెబ్బ కారణంగా రాష్ట్రంలో చనిపోయిన వారి సంఖ్య 30కిపైగా ఉన్నట్లు మీడియా కథనాలు వెల్లడించాయి.


## ఉప ఎన్నికల ఫలితాలపై

# ఉత్కంఠ

కల్వకుర్తి : ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ కొనసాగుతుంది. ఎన్నికల ఫలి తాలకు మరో మూడు రోజులు మాత్ర మే గడువు ఉండడంతో ఫలితాలపై అందరూ ఆసక్తి కనబరుస్తున్నారు. వచ్చేనెల రెండవ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓట్లు లెక్కించేందుకు అధికార యంత్రాంగం ప్రారం భించింది. ఈ ఎన్నికలలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు హోరా హోరిగా తలపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చిన తర్వాత ఈ ఎన్నికలు తొలి ఎన్నికలు కావడంతో కాంగ్రెస్ పార్టీ ఈ ఎమ్మెల్సీ ఎన్నికను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని ముందుకు సాగింది. బీఆర్ఎస్ పార్టీకి మెజార్టీ ఓట్లు ఉన్నప్పటికీ విజ యంపై వారికి నమ్మకం లేకుండా పోయింది.

ప్రతి పక్ష పార్టీకి చెందిన ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరా రు.

ఈ నేపథ్యంలోనే ఈ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయంపై ధీమాతో ఉంది. మొత్తం 1439 ఓట్లకు గాను 1437 ఓట్లు పోల్ అయినట్లు ఎన్నిక ల అధికారులు ప్రకటించారు. మొత్తం 99.86 శాతం పోలింగ్ నమోద యింది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సైతం




కొడంగల్ నియోజ కవర్గంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్ రెడ్డిలు ఎన్నికలలో పోటీపడి కోట్లాది రూపాయలు ఖర్చు చేసినట్లు అప్పట్లో ప్రచారం సాగింది. కాంగ్రెస్ అభ్యర్థి ఓటుకు 4లక్షలు, బీఆర్ఎస్ అభ్యర్థి ఓటుకు మూడు లక్షలు పంచినట్లు అప్పట్లో జోరుగా ప్రచారం సాగింది. ఈ నేపథ్యంలోనే విజయంపై ఇద్దరు నాయకులు దీమాతో ముందుకు సాగుతున్న ప్పటికీ లోలోన ఆందోళన చెందుతున్న ట్లు ప్రచారం సాగుతుంది. మరో మూడు రోజులు వెయిట్ చేస్తే ఎమ్మె ల్సీ ఉప ఎన్నికల ఫలితాలు వస్తాయి..

# ఏందా ధీమా

## 'ఆ స్థానాల్లో మేమే గెలుస్తాం'




## గులాబీ గూటిలో అంచనాలకు అందని విశ్వాసం

హైదరాబాద్ : కొద్దిరోజుల క్రితం తెలంగాణలోని 17 పార్లమెంట్ నియోజక వర్గాలకు ఎన్నికలు జరిగాయి. ఎన్నికల్లో గెలుపు తమదంటే తమదని , మెజారిటీ స్థానాలను గెలుచుకోబోతున్నామని , బీఆర్ఎస్ , బిజెపి, కాంగ్రెస్ లు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. అయితే ప్రధానంగా కాంగ్రెస్, బిజెపిల మధ్య పోటీ నెలకొందని , బీఆర్ఎస్ మూడో స్థానానికి పరిమితం అవుతుందనే ప్రచారం తీవ్రంగా జరుగుతున్న నేపథ్యంలో, బీఆర్ఎస్ ఎన్నికల ఫలితాలపై స్పందిస్తోంది. లోక్ సభ ఎన్నికల్లో జాతీయ పార్టీలకు ధీటుగా తాము మెజారిటీ స్థానాలను దక్కించుకుంటామని, ఆ పార్టీ ధీమా వ్యక్తం చేస్తుంది. పోలింగ్ సరళిని పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు గెలిచే అవకాశం ఉన్న నియోజకవర్గం ఒక అంచనాకు వచ్చారు. హైదరాబాద్ మినహాయించి మిగిలిన 16 స్థానాల్లో పోలింగ్ జరిగిన తీరును బీఆర్ఎస్ స్వాగతిస్తోంది. సైలెంట్ ఓటింగ్ తమకి కలిసి వస్తుందని ఆశలు పెట్టుకుంది. తెలంగాణలో 17 లోక్ సభ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. అయితే హైదరాబాద్ స్థానం ఎంఐఎం కు కంచుకోట కావడంతో, మిగిలిన స్థానాల్లో తప్పకుండా తామే గెలుస్తామని అంచనా వేస్తున్నాయి. పోలింగ్ ముగిసిన తర్వాత నుంచి వస్తున్న సమాచారంతో , మెజారిటీ పార్లమెంట్ స్థానాల్లో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని, ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. డబల్ డిజిట్ స్థానాలను కచ్చితంగా గెలుచుకుంటామని అంచనా వేస్తున్నారు. అయితే క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పూర్తిగా పరిశీలించిన తర్వాత, ఆరు నుంచి ఏడు స్థానాల్లో కచ్చితంగా గెలుస్తామని బీఆర్ఎస్ కీలక నేతలు కొంతమంది వ్యాఖ్యానిస్తున్నారు. ముఖ్యంగా కరీంనగర్, మెదక్ ,పెద్దపల్లి , నాగర్ కర్నూల్ నియోజక వర్గాల్లో కచ్చితంగా గెలిచేది బీఆర్ఎస్ అనే అంచనాకు వస్తున్నాయి. ఇక సికింద్రాబాద్, నిజామాబాద్ ఎన్నికల ఫలితాలు తమకు అనుకూలంగానే ఉంటాయని అంచనా వేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పై ఐదు నెలల కాలంలో తీవ్రంగా వ్యతిరేకత వచ్చిందని బిఆర్ఎస్ అంచనా వేస్తోంది . దీంతో ప్రభుత్వ వ్యతిరేక ఓటు తమకు అనుకూలంగా మారుతుందని, బిజెపికి క్షేత్రస్థాయిలో సరైన కేడర్ లేకపోవడం కూడా బీఆర్ఎస్ విజయవకాశాలను మెరుగుపరుస్తాయని ఆ పార్టీ లెక్కలు వేసుకుంటుంది. చాలా నియోజకవర్గాల్లో బిజెపి ప్రభావం ఉన్నప్పటికీ , బీఆర్ఎస్ , కాంగ్రెస్ అభ్యర్థులు గట్టిగానే పోటీ ఇచ్చారని, మరికొన్ని స్థానాల్లో బీఆర్ఎస్ బిజెపి మధ్య ప్రధానంగా పోటీ నెలకొందని చెబుతున్నారు. ఏది ఏమైనా కాంగ్రెస్, బిజెపిల కంటే ఎక్కువ స్థానాలని గెలుచుకుంటామని ఆ పార్టీ అంచనాకు వస్తుంది.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## గాజాలో ఆ 13,000 మంది ఏమయ్యారు?

హమాస్ – ఇజ్రాయేల్ మధ్య జరుగుతున్న యుద్ధం ఇప్పుడు అంతర్జాతీయంగా తీవ్ర చర్చనీయాంశం అవుతున్న సంగతి తెలిసిందే. ఈ యుద్ధంవల్ల గాజాలో ఇప్పటికే సుమారు 36 వేల మంది పాలస్తీనియన్లు మరణించారని అంటున్నారు. ఇలా మరణించిన వారి విషయంపై క్లారిటీ ఉందట కానీ.. తాజాగా అదృశ్యమైన వారి సంఖ్య తీవ్ర చర్చనీయాంశం అవుతుంది. వారి సంఖ్య సుమారు 13,000 ఉండొచ్చని అంటున్నారు. అవును... అక్టోబరు 7న, ఇజ్రాయెల్‌లోని ఒక మ్యూజిక్ ఫెస్ట్ లక్ష్యంగా హమాస్ ఉగ్రవాదులు దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ ఊచకోతలో సుమారు 1,200 మంది మరణించారు. మరోపక్క హమాస్ ఫైటర్లు సుమారు 252 మందిని బందీలుగా తీసుకెళ్లారు. దీంతో హమాస్ ను తుదముట్టించడమే లక్ష్యంగా గాజాపై ఇజ్రాయెల్ దాడి మొదలుపెట్టింది.. గాజాపై విరుచుకుపడిపోతుంది. అయితే... గాజాపై ఇజ్రాయేల్ సైన్యం దాడులు చేస్తున్నప్పటి నుంచీ గాజాలోని సుమారు 13,000 మంది ఆచూకీ తెలియడం లేదని జెనీవాలో ఉన్న యూరో మెడ్ హ్యూమన్ రైట్స్ మానిటర్ అనే స్వచ్ఛంద సంస్థ వెల్లడించింది. దీంతో ఆ పదమూడు వేల మంది పాలస్థీనియన్లు ఏమయ్యారనే చర్చ బలంగా వినిపిస్తుంది. ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 13,000 మంది ఆచూకి తెలియడం లేదనే విషయం ఇప్పుడు గాజాలో చర్చనీయాంశంగా మారింది. అయితే వీరిలో సుమారు 10,000 మంది వరకూ శిథిలాల కింద చిక్కుని మృతి చెంది ఉంటారని అంటున్నారు. ఈ మేరకు గాజా సివిల్ డిఫెన్స్ ఆ విధంగా అంచనా వేసింది. ఇక్కడ మరో టెన్షన్ విషయం ఏమిటంటే... గాజాలోని శిథిలాల కింద చాలా మృతదేహాలతో పాటు సుమారు 7,500 టన్నుల పేలని ఆయుధాలు మిగిలి ఉన్నాయని ఐక్యరాజ్య సమితి భావిస్తోంది. దీంతో.. ఇది మరింత ఆందోళనకరమైన అంశం అని అంటున్నారు. ప్రస్తుతం శిథిలాల కింద నుంచి మృతదేహాలను వెలికితీసేందుకు వలంటీర్లతో కలిసి సివిల్ డిఫెన్స్ పనిచేస్తోంది. ఈ సమయంలో గాజాలో ఎండలు పెరుగుతుండటంతో శిథిలాల కింద చిక్కుకున్న మృతదేహాలను వెలికితీయకపోతే.. అవి కుళ్ళిపోతాయని, ఫలితంగా ఇది ఆరోగ్య సమస్యకు దారితీస్తుందనే ఆందోళన కూడా వినిపిస్తుంది. దీంతో... మృతదేహాలను వెలికితీసేందుకు ఐక్యరాజ్యసమితితో పాటు అనుభవజ్ఞులైన సిబ్బంది ఉన్న దేశాల మద్దతును కోరింది సివిల్ డిఫెన్స్! ఇదంతా ఒకెత్తు అయితే... అదృశ్యమైన వ్యక్తులను ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) నిర్బంధించి ఉండవచ్చని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ భావిస్తోంది. ఇదే సమయంలో గాజాకు చెందిన వందలమంది పాలస్తీనియన్లు ఐడీఎఫ్ ఆధీనంలో ఉన్నారని.. ఈ విషయంపై వారి కుటుంబాలకూ సమాచారం లేదని యూరో మెడ్ హ్యూమన్ రైట్స్ మానిటర్ ఆరోపిస్తోంది. మరి ఈ మిస్సింగ్ వ్యక్తుల ఆచూకీపై హమాస్ ఆధ్వర్యంలో నడిచే ఆరోగ్య మంత్రిత్వ శాఖ అలాంటి ఆలోచనలు చేయబోతుందనేది వేచి చూడాలి!

# కాల్వలను కప్పేసి.. ప్లాట్లుగా విక్రయించి



సిరిసిల్ల : గొలుసుకట్టు చెరువులను కలిపే కాల్వలు కబ్జాలతో కనుమరుగైపోతున్నాయి. దీంతో చెరువుల్లోకి వెళ్లాల్సిన వరద కాలనీలను ముంచెత్తుతుంది. నీటి నిర్వహణ సక్రమంగా లేకపోవడం, అభివృద్ధి పేరుతో ఆక్రమణలు పెరిగి వాటిపైన నిర్మాణాలు వెలుస్తుండటం పర్యావరణ సమతుల్యతకు ప్రమాదకరంగా పరిణమిస్తోంది. జిల్లాలో ముఖ్యంగా సిరిసిల్ల, వేములవాడ రెండు పురపాలక సంఘాల పరిధిలో ఈ కాల్వల ఆక్రమణలు ఎక్కువగా ఉన్నాయి. వీటిలో మట్టి నింపి ఏకంగా ప్లాట్లుగా చేసి విక్రయించేశారు. ఈ ఆక్రమణలు అధికారుల కళ్లెదుటే జరుగుతున్నా స్థలాల పరిశీలన, హద్దుల నిర్ణయం, ఆక్రమణల తొలగింపు వంటి చర్యలేవీ ఉండటం లేదు. గృహాలకు, వాటి పరిసర ప్రాంతాలు వరద ముంపునకు గురైతే మాత్రం పురపాలిక, రెవెన్యూ, నీటిపారుదల, పోలీసుశాఖ అధికారులు ఆ సమయంలో హడావుడి చేస్తున్నారు. తర్వాత అటువైపు కన్నెత్తి చూడటం లేదు. వీరి మధ్య సమన్వయ లోపంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

కాలనీలకు పొంచి ఉన్న ముప్పు

సిరిసిల్ల, వేములవాడ పట్టణాలు రోజు రోజుకు విస్తరిస్తున్నాయి. ఒకప్పుడు ఈ రెండు పట్టణాల చుట్టూ పదుల సంఖ్యలో చెరువులు, కుంటలు ఉండేవి. కాల్వల కబ్జాలతో వాటి నామ రూపాల్లేకుండా పోయాయి.

వేములవాడ గ్రామీణ మండలం మల్లారంలో మూలవాగు చెక్‌డ్యాం నుంచి వచ్చే వరద కాల్వ గుడిచెరువులోకి చేరుతుంది. దీని పొడవునా ఆక్రమించారు. పంట పొలాలు ఉన్న చోట నీరు వాటి మీదుగా ప్రవహిస్తుంది. పట్టణంలోకి వచ్చేసరికి వరదతో లోతట్టు ప్రాంతాలైన ఓల్డ్ అర్బన్ కాలనీ పరిసర ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. మరోవైపు మర్రిపల్లి, నాగయ్యపల్లి, గొర్లకుంట చెరువు, కోనాయపల్లిలోని కొత్తచెరువుల నుంచి వచ్చే వరద కాల్వ గుడిచెరువులో కలుస్తుంది. ఇక్కడ సబ్‌స్టేషన్ సమీపంలో వరద కాల్వలను కప్పేసి ప్లాట్లుగా చేశారు. బైపాస్ నిర్మాణ సమయంలో వరద కాల్వ ఉన్నట్లు ఆర్అండ్‌బీ అధికారులు గుర్తించలేదు. వరదలకు సబ్‌స్టేషన్‌తోపాటు రెండోబైపాస్ రహదారి ముంపునకు గురవుతుంది. పట్టణ శివారు కాలనీల్లోకి నీరు చేరుతుంది. ఇక్కడ వరద ముంపు పరిస్థితులపై నీటిపారుదలశాఖ అధికారులు పరిశీలించి కాల్వతోపాటు వంతెన నిర్మాణాలు చేపట్టాలని ఉన్నతాధికారులకు నివేదికలు పంపారు. ఇప్పటికీ అవి కార్యరూపం దాల్చలేదు.

వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం వద్ద రెండేళ్ల క్రితం ఉపాధి హామీ పథకంలో హరితహారంలో భాగంగా రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు. ప్రస్తుతం అవి ఏపుగా పెరిగాయి. ఇక్కడ ఏడాది క్రితం రియల్ వెంచర్ వేసిన వారు ఈ చెట్లు వెంచర్ లోపల ఉంచి బయట గోడ నిర్మించారు. వెంచర్ వెంట కొన్ని చోట్ల చెట్లను నరికివేశారు. అయినా పురపాలిక, రహదారులు భవనాలు, నీటిపారుదలశాఖ అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు.

సిరిసిల్ల పురపాలికలో రెండో బైపాస్ రహదారి నిర్మాణం పూర్తయింది. ఇక్కడ విలీన గ్రామాల్లోని 12 గొలుసుకట్టు చెరువులను కలుపుతూ వచ్చే వరద కాల్వ బైపాస్ రోడ్డు నిర్మాణంతో నామరూపాల్లేకుండా పోయింది. బైపాస్ నిర్మాణంలోనైనా ఆర్అండ్‌బీ అధికారులు గుర్తించి రెండువైపులా వరద వెళ్లేలా కాల్వలు నిర్మించాలి. కానీ రహదారి, కల్వర్టులు, వంతెన నిర్మాణం చేసి చేతులు దులుపుకున్నారు. ఇదే అదనుగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు కాల్వలను కప్పేసి ప్లాట్లుగా చేశారు. గతేడాది చిన్నబోనాలలోని చెరువు కట్ట తెగడంతో నీరు వెళ్లని పరిస్థితి ఏర్పడటంతో ముష్టిపల్లి, రాజీవ్‌నగర్, పద్మానగర్ ప్రాంతాలను ముంచెత్తుతూ కొత్త చెరువులోకి చేరింది. ఇక్కడ వరద వెళ్లేలా కాల్వలు నిర్మించాలని ఆయా కాలనీలకు చెందినవారు నీటిపారుదల, ఆర్అండ్‌బీ అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది.

అధికారులేమంటున్నారంటే...

వేములవాడ పట్టణంలోని గుడిచెరువులోకి వచ్చే వరద కాల్వ రెండు వైపులా ఆక్రమణలను గుర్తించినట్లు వేములవాడ డీఈ శ్రీనివాస్ తెలిపారు. నీటిపారుదలశాఖ వద్ద ఉన్న నక్షప్రకారం వీటిని పరిశీలించినట్లు పేర్కొన్నారు. సిరిసిల్ల బైపాస్ రోడ్డులో వరద కాల్వ నిర్మాణానికి హద్దులు నిర్ణయించాలని రెవెన్యూ అధికారులను కోరినట్లు సిరిసిల్ల డీఈ కిషోర్ తెలిపారు. వరద కాల్వలు, ప్రభుత్వ భూములు ఆక్రమించి ప్లాట్లు చేస్తున్న వాటిని గుర్తించి వాటికి అనుమతులు ఇవ్వడం లేదని జిల్లా పట్టణ ప్రణాళిక అధికారి అన్సారీ చెప్పారు. సిరిసిల్ల పట్టణంలో ఇదే మాదిరిగా కాల్వను ఆక్రమించి ప్లాట్లుగా చేసిన వెంచర్ అనుమతులు రద్దు చేశామన్నారు.

# ప్రభుత్వ చర్యలతోనే పారిశ్రామిక లోటు భర్తీ



జగిత్యాల : జగిత్యాల జిల్లా విభిన్న పైర్లసాగుతో రాష్ట్రంలోనే తొలివరుసలో ఉన్నా అనుబంధ పరిశ్రమల ఏర్పాటులో మాత్రం వెనకబడే ఉంది. కనీసం ఈ ఆర్థిక సంవత్సరంలోనైనా టీఎస్ఐపాస్ ద్వారా యూనిట్లను, పీఎంఈజీపీ యూనిట్లను, టీప్రైడ్‌ద్వారా పెట్టుబడి రాయితీని అధికంగా మంజూరు చేయాల్సి ఉంది. జిల్లాలోని ముత్యంపేట చక్కెర కర్మాగారం తెరిస్తే కనీసం 50 వేల ఎకరాల్లో చెరకును, మూతపడిన సోయాబీన్ నూనె తయారీ పరిశ్రమను తెరిస్తే 30 వేల ఎకరాల్లో సోయాబీన్‌ను సాగు చేస్తారు.

రూ.865 కోట్లు.. 1,250 పరిశ్రమలు

జిల్లాలో ఆహార పంటలను 3.64 లక్షల ఎకరాలు, ఉద్యాన పంటలను 79 వేల ఎకరాల్లో సాగుచేస్తున్నారు. ఇటీవల టీఎస్ ఐపాస్ ద్వారా రూ.865 కోట్లు మంజూరుకాగా 1,250 పరిశ్రమలను నెలకొల్పారు. ఈ పరిశ్రమల్లో 10 వేలమంది వరకు ఉపాధి పొందుతుండగా పరిశ్రమల సంఖ్య పెరిగితే మరింతమందికి ఉపాధి కలుగుతుంది, రైతుల ఉత్పత్తులకు స్థానికంగానే అధిక ధరలు దక్కుతాయి. నాబార్డు రుణాలకు తోడుగా రాష్ట్రప్రభుత్వం రాయితీలనిస్తే వ్యవసాయ అనుబంధంగా చేపలు, రొయ్యలు, కోళ్ల పెంపకం, మేకలు, గొర్రెలు, తేనెటీగల పెంపకం, పాడిపరిశ్రమ, పట్టుపురుగుల పెంపకం తదితరాలను కూడా చేపట్టినపుడు సాగుకు ఆర్థిక ఆసరాగా ఉంటుంది.


అందుబాటులోకి తెస్తే మేలు యశ్వంతరావుపేట వద్ద ఆయిల్‌పామ్ క్రషింగ్ యూనిట్ను నెలకొల్పుతున్నారు. పారిశ్రామిక ప్రాంత స్థానిక ప్రాధికార హోదాతో పరిశ్రమలశాఖ, రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ద్వారా పల్లెల్లో పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేయాలి. మెట్లచిట్టాపూర్ వద్ద 150 ఎకరాల్లో ఫుడ్‌ప్రాసెసింగ్ ప్లాంటును నెలకొల్పాలని యోచించినా స్థానికులు వద్దంటున్నారు. వెల్గటూరు మండలం స్తంభంపల్లి వద్ద 75 ఎకరాల్లో మెగా ఫుడ్‌పార్కును ఏర్పాటు చేయాల్సి ఉంది. పారిశ్రామిక అభివృద్ధి మండళ్ల కేటాయింపుల్లో భాగంగా జిల్లాకు మామిడి పరిశోధన కేంద్రాన్ని కేటాయించినా క్షేత్రస్థాయికి చేర్చాలి. జగిత్యాల మండలం లక్ష్మీపూర్‌లో రూ.7 కోట్లతో నిర్మిస్తున్న విత్తనశుద్ధి కర్మాగారాన్ని, పొలాస పరిశోధన స్థానంలోని పారిశ్రామిక యూనిట్ల శిక్షణ ఇంక్యూబేషన్ సెంటర్‌ను అందుబాటులోకి తెస్తే రైతులకు ఉపయుక్తంగా ఉంటుంది.

జిల్లాలోని పలు గ్రామాల్లో రైతులు ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లుగా (ఎఫ్.పి.ఒ) ఏర్పడగా వీరికి పరిశ్రమల ఏర్పాటుకు అవకాశమివ్వాలి. బియ్యం మిల్లులు, మామిడి తాండ్ర, రసం తయారీ పరిశ్రమలు, పసుపు పాలిషింగ్, పొడి, రంగులు, ఔషధాల తయారీ, మక్కల ఉప ఉత్పత్తులైన కోళ్లదాణా, బిస్కట్లు, గంజిపొడి పరిశ్రమల ఏర్పాటుకు అనువుగా ఉంటుంది. సంకరవరి, సూటివరి, గడ్డిజొన్న, తెల్లజొన్న, ఎర్రజొన్న, ఆవాలు, పొద్దు తిరుగుడు, మొక్కజొన్న, నువ్వులు తదితర పంటల్లో విత్తనోత్పత్తి చేపడుతుండగా విత్తనశుద్ధి కర్మాగారాలను, విత్తనోత్పత్తి కంపనీలను నెలకొల్పవచ్చు. నూనె మిల్లులు, పప్పు మిల్లులు, పత్తి జిన్నింగ్ మిల్లు, మిరప ఉప ఉత్పత్తుల తయారీ మిల్లులను ఏర్పాటు చేయవచ్చు. అరటి, బొప్పాయి, ఇతర పండ్ల తోటలు, కూరగాయల సాగు అధికంగా ఉండగా అన్ని పంటల్లోనూ ఆహారశుద్ధి, ఎగుమతి పరిశ్రమలను ఏర్పర్చాలి.

విత్తనశుద్ధి కర్మాగారంతో ప్రయోజనం

మా గ్రామంలో అసంపూర్తిగా ఉన్న విత్తనశుద్ధి కర్మాగారాన్ని పూర్తి చేసి పనిచేయిస్తే జిల్లాలోని రైతులు దాదాపుగా 30 వేల ఎకరాల్లో విత్తనోత్పత్తి చేపట్టే వీలుంది. ఎఫ్‌పీవోల ద్వారా దరఖాస్తు చేసిన మేరకు పసుపు పాలిషింగ్, నూనె, బియ్యం మిల్లులకు రాయితీతో కూడిన అనుమతులు ఇవ్వాలి. కొట్టాల మోహన్‌రెడ్డి, లక్ష్మీపూర్

# దస్త్రాలపై కోడ్ భాష



కరీంనగర్ : కరీంనగర్ జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో అనిశా డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. మధ్యాహ్నం 12–30 గంటలకు ప్రారంభమైన తనిఖీలు సాయంత్రం 6–30 గంటల వరకు కొనసాగాయి. డ్రైవింగ్ లైసెన్స్, రెన్యూవల్, సామర్థ్య పరీక్షలు, ఇతర పనుల కోసం వచ్చిన వారి నుంచి ప్రధాన ద్వారం వద్ద దస్త్రాలు తీసుకొని పరిశీలించారు. కౌంటర్లను, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అనిశా డీఎస్పీ రమణమూర్తి మీడియాతో మాట్లాడుతూ... “జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో అవకతవకలు జరిగినట్లు తేలింది. చెల్లించాల్సిన డబ్బుల కంటే అధికంగా చెల్లించినట్లు గుర్తించాం. ఏజెంట్లకు చెల్లించినట్లు చెబుతున్నారు. డ్రైవింగ్ స్కూళ్లు, ఏజెంట్ల ద్వారా ఈ తతంగం నడుస్తున్నట్లు చెబుతున్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి వివరాలు సేకరిస్తాం. డీఎల్, రెన్యూవల్ లైసెన్స్, తనిఖీ వాహనాల వివరాలు సేకరించాం. పూర్తి స్థాయి విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తాం. దస్త్రాలపై కోడ్ భాషలో అక్షరాలు, పేర్లు రాస్తున్నట్లు గుర్తించాం.” అని అన్నారు. తనిఖీల్లో అనిశా సీఐ కృష్ణకుమార్ పాల్గొన్నారు.

# అందుబాటులో అత్యవసర వైద్యం

మెదక్: రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి, ఇతర అత్యవసర సమయాల్లో వైద్య సేవలందాలంటే రాష్ట్ర రాజధానికి పరుగెత్తాల్సిందే. జిల్లాలో నాలుగు జాతీయ రహదారులు ఉండగా, ఒకటి మినహా మిగిలిన మూడు చోట్ల నిత్యం రక్తమోడుతాయి. తీవ్రంగా గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందక మధ్యలోనే ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ క్రమంలో అత్యవసర విభాగం (క్రిటికల్ కేర్)ను అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పించాయి. ఈ మేరకు ప్రత్యేకంగా నిధులు కేటాయించడంతో భవన నిర్మాణ పనులు వడివడిగా సాగుతున్నాయి. మరో ఆరునెలల్లో పనులు పూర్తయి అందుబాటులోకి రానుందని అధికారులు చెబుతున్నారు. ఈ అంశంపై కథనం...

సకాలంలో చికిత్స అందక.. జిల్లా కేంద్రం మెదక్‌లో ప్రభుత్వ ఆసుపత్రి, మాతాశిశు సంరక్షణ కేంద్రం(ఎంసీహెచ్), నర్సాపూర్‌లో ప్రాంతీయ, తూప్రాన్, రామాయంపేట, కౌడిపల్లిలో సామాజిక ఆసుపత్రులున్నాయి. జిల్లాలో ఎక్కువగా 44, 163, 765(డి) జాతీయ రహదారులపై రోడ్డుప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాల్లో గాయపడిన వారిని స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రాథమిక చికిత్స



నిర్వహించి గాంధీ, ఉస్మానియా ఆసుపత్రులకు తరలిస్తున్నారు. క్షతగాత్రులు అక్కడికి చేరుకునే సరికి సమయం మించిపోతోంది. సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్న ఘటనలున్నాయి. మరోవైపు ఆయా ఆసుపత్రుల్లో అధునాతనమైన పరికరాలు లేక క్షతగాత్రులతో పాటు ఇతర అత్యవసర వైద్య పరిస్థితుల్లో వచ్చేవారికి వైద్యం అందడం లేదు.

రూ.23.75 కోట్లతో నిర్మాణం

రాష్ట్ర రాజధానికి జిల్లా సమీపంలో ఉండడంతో అత్యవసర సేవలకు అక్కడికి వెళ్లాల్సి రావడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరోవైపు సకాలంలో వైద్యం అందక ప్రాణాలు నిలవడం లేదు. ఈ క్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి జిల్లాలో అత్యవసర విభాగానికి (క్రిటికల్ కేర్)ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా కేంద్రం మెదక్‌లో మాతాశిశుసంరక్షణ కేంద్రం పక్కన స్థలాన్ని ఎంపిక చేశారు. భవన నిర్మాణానికి ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ.23.75 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు కొద్దినెలల క్రితం శంకుస్థాపన జరుగగా, టెండర్ దక్కించుకున్న గుత్తేదారు పనులు మొదలుపెట్టారు. గ్రౌండ్‌ఫ్లోర్‌తో పాటు మొదటి అంతస్తును నిర్మిస్తున్నారు. ప్రస్తుతం గ్రౌండ్ ఫ్లోర్ స్లాబ్ పూర్తయి, మొదటి అంతస్తు స్లాబ్ పనులు జరుగుతున్నాయి. ఇందులో ఆపరేషన్ థియేటర్లు, ఆక్సిజన్‌తో కూడిన ఐసీయూ గదులు, అత్యవసర వైద్యం అందించే గదులను నిర్మించనున్నారు. మొత్తం 50 పడకలను ఇందులో ఏర్పాటు చేయనున్నారు.

పేదలకు ప్రయోజనం .. జిల్లాలో ఎక్కడైనా రోడ్డు ప్రమాదాలు జరిగినా, ఇతర అత్యవసర వైద్యం ఈ క్రిటికల్ కేర్‌లో అందనుంది. వైద్యులు, సిబ్బంది నియామకంతో పాటు, అత్యాధునిక వైద్య పరికరాలను ఏర్పాటు చేయనున్నడంతో జిల్లా వాసులకు ప్రయోజనం చేకూరనుంది. జిల్లా కేంద్రం నుంచి ఆయా మండలాల పరిధి 50 కి.మీల లోపలే ఉన్నాయి. దీంతో హైదరాబాద్‌కు వెళ్లి ఆర్థిక ఇబ్బందులు పడే నిరుపేదలకు క్రిటికల్ కేర్ స్వాంతన చేకూర్చనుంది. ఇప్పటికే జిల్లా కేంద్రం మెదక్‌కు ప్రభుత్వ వైద్యకళాశాల మంజూరైన సంగతి విధితమే. ప్రస్తుత విద్యా సంవత్సరంలో తరగతులు మొదలుకానున్నాయి. ఈ క్రమంలో ఎంసీహెచ్ వెనకాల క్రిటికల్ ఏర్పాటుతో అత్యవసర వైద్యం అందనుంది. ఆరు నెలల్లో పనులు పూర్తి చేస్తామని రాష్ట్ర వైద్యసేవల మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్(టీఎస్ఎంఐడీసీ) ఏఈ మహేశ్‌కు తెలిపారు.

# రక్తశుద్ధి భాదితులకు భరోసా

సంగారెడ్డి :నారాయణఖేడ్ జీవన శైలిలో మార్పులతో చాలామంది మూత్రపిండాల వ్యాధుల బారిన పడుతున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా సోకుతుండడం ఆందోళన కలిగిస్తోంది. వ్యాధి బారిన పడి పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని బాధితులకు గత ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రాధాన్యమిచ్చింది. గతంలో వారంతా హైదరాబాద్‌లోని నిమ్స్, గాంధీ ఆసుపత్రులకు పరుగులు తీసేవారు. లేదంటే కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖరీదైన సేవలు అందుతుండడం పేదలకు వరంగా మారింది.

జిల్లా కేంద్రంలో...:ప్రభుత్వ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా రక్తశుద్ధి(డయాలసిస్) సేవలకు శ్రీకారం చుట్టారు. 2017లో సంగారెడ్డిలో రక్తశుద్ధి కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకొచ్చారు. ఇక్కడ తొమ్మిది పడకల ద్వారా 24 గంటలపాటు వైద్య సేవలందిస్తున్నారు. రోజుకు 30 మంది రక్తాన్ని శుద్ధి చేస్తున్నారు. రాత్రిపూట రోగులకు ఇబ్బంది కలుగుతోంది. సమస్య పరిష్కారానికి అదనంగా మరో ఆరు పడకలు పెంచేలా జిల్లా ఆస్పత్రి వర్గాలు ప్రభుత్వానికి నివేదిక పంపాయి. ఆగస్టు నుంచి ఈ సేవలు అందుబాటులోకి రానున్నట్లు చెబుతున్నారు.

నారాయణఖేడ్‌లో 2018లో అయిదు పడకల ఆసుపత్రిని వినియోగంలోకి తీసుకొచ్చారు. అక్కడ రోజుకు 15 మంది రోగులు సేవలు పొందుతున్నారు. ఇంతకుముందు హైదరాబాద్‌కు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం స్థానికంగా ప్రభుత్వ ఆస్పత్రిలో సేవలు అందుతుండడంపై రోగులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వ్యయప్రయాసల నుంచి విముక్తి లభించిందని అంటున్నారు.

జహీరాబాద్‌లో 2019లో అయిదు పడకలు ఏర్పాటు చేశారు. ఇక్కడ 80 మంది రోగులు నమోదయ్యారు. వారికి 24 గంటలపాటు సేవలు అందించడం చాలా ఇబ్బందిగా మారింది. 40 మందికి అదనంగా మరో అయిదు పడకలు కల్పిస్తే బాధితులకు ఎంతో మేలు కలుగుతుంది.

జోగిపేట ప్రభుత్వ ప్రాంతీయ వంద పడకల ఆసుపత్రిలో గతేడాది రక్తశుద్ధీకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఐసోలేషన్ బెడ్‌తోపాటు నాలుగు పడకలున్నాయి. 22 మంది రోగులు చికిత్స పొందుతున్నారు. 24 గంటలపాటు సేవలు అందిస్తున్నామని, అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రమేశ్ తెలిపారు.

అదనపు సేవలకు ప్రతిపాదనలు..జిల్లాలో రక్తశుద్ధి కేంద్రాల్లో రోగులకు అనుగుణంగా సేవలు పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం. అదనపు పడకలు పెంచి అక్కడ రోగులకు సమస్యలు లేకుండా చూడాలని ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక పంపాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే సేవలు కల్పిస్తాం.

# రాయితీ దక్కదు.. వడ్డీ వదలదు



వికారాబాద్ : ప్రకృతి అనుకూలించక అన్నదాతలు అవస్థలు పడుతుంటే పంట రుణాలపై బ్యాంకులు వడ్డీ వసూలు చేస్తూ అదనపు భారం మోపుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచే వానాకాలం పంట రుణాల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. ఉత్పత్తుల విక్రయాలతో వచ్చే సొమ్ముతో రైతులు రుణాలను పెద్ద ఎత్తున నవీకరణ (రెన్యువల్) చేస్తారు. అయితే రుణాలకు పావలా వడ్డీని వర్తింపజేసే రాయితీపై ప్రభుత్వ ఉత్తర్వులు రానందున బ్యాంకులు వడ్డీని వసూలు చేస్తుండటంతో రైతులపై ఏటా రూ.75 కోట్ల భారం పడుతోంది. దీనికి సంబంధించి కథనం.

తీసుకున్న తేదీ నుంచే వర్తింపు రైతులు బ్యాంకుల నుంచి పంట రుణాలను తీసుకున్న తేదీ మొదలు ఏడాది లోపు అసలు చెల్లిస్తే రూ.లక్ష వరకు సున్నా వడ్డీ, రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు ఉన్న రుణాలకు పావలా వడ్డీ వర్తింపజేస్తున్నారు.

వ్యవసాయ రుణాలకు 7 శాతం వడ్డీ ఉండగా, 3 శాతం కేంద్ర ప్రభుత్వం, 4 శాతం రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకులకు చెల్లించాలి. కేంద్రం వడ్డీ రాయితీని సక్రమంగా చెల్లిస్తోంది.

నిధులు కేటాయిస్తేనేగదా..

గడిచిన ఆరేళ్లలో తొలి రెండు సంవత్సరాల్లో రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ రాయితీ ఇస్తున్నట్లు ఉత్తర్వులను జారీ చేసినా బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు నిధులు కేటాయించలేదు. ఫలితంగా చాలా సంఘాలు, బ్యాంకర్లు తామే వడ్డీని భరించాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో బ్యాంకర్లు, సహకార సంఘాలు మూడేళ్లుగా రైతుల దగ్గర నుంచి తప్పనిసరిగా వడ్డీ వసూలు చేస్తున్నాయి.

మరోవైపు జిల్లాలోని 22 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.105 కోట్లకు పైగా రాయితీ రావాల్సి ఉంది. ఈ మొత్తం రానందున లాభాలను బదలాయించక రైతులు రెండు రకాలుగా నష్టపోతున్నారు.

జిల్లాలో 2.44 లక్షల మంది రైతులు వానాకాలం, యాసంగి సీజన్లలో రూ.2,175 కోట్ల వరకు పంట రుణాలు తీసుకుంటున్నారు. రైతుల నుంచి వడ్డీ తీసుకోకున్నా కూడా ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్‌గా బ్యాంకర్లకు ఇస్తే తిరిగి రైతులకు బ్యాంకర్లు చెల్లిస్తారు. అయితే ప్రభుత్వం ఇవ్వకపోవడంతో తామే నేరుగా వసూలు చేయాల్సి వస్తోందని బ్యాంకర్లు చెబుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాలు రావాల్సి ఉంది

– రాంబాబు, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగానే రైతులకు వడ్డీ రాయితీ వర్తింపజేస్తాం. వడ్డీ వసూలుపై ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాల్సి ఉంది. నిధులు విడుదలైతేనే రాయితీ వ్యవహారం కొలిక్కి వస్తుంది. లేదంటే రైతులే వడ్డీ చెల్లించక తప్పదు.

పావలా వడ్డీ కూడా వర్తించలేదు

– నర్సిములు, అల్లీపూర్, ధారూర్

నేను ఎస్‌బీఐ ధారూర్‌శాఖలో ఏడాది కిందట రూ.లక్ష పంట రుణం తీసుకున్నా. రూ.8 వేలు చెల్లించి రుణాన్ని నవీకరణ చేసుకున్నా. గతంలో మాదిరిగా ఎలాంటి రాయితీ ఇవ్వలేదు. పావలా వడ్డీ కూడా వర్తించలేదు. బ్యాంకు సిబ్బందిని అడిగితే వడ్డీ రాయితీ నిధులు వస్తే చెల్లిస్తామన్నారు.

ఆర్థిక ఆసరా కల్పించాలి రాములు, పుల్‌మద్ది, వికారాబాద్

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, శివారెడ్డిపేటలో రూ.80 వేలు పంట రుణం తీసుకున్నా. ఐదేళ్ల కిందట బ్యాంకులో పంట రుణాలను తీసుకున్న తేదీ నుంచి ఏడాది లోపు అసలు చెల్లిస్తే రూ.లక్ష వరకు వడ్డీ వేసేవారు కాదు. ప్రస్తుతం సున్నా వడ్డీ ఊసే ఎత్తడం లేదు. వడ్డీ వసూలు చేయకుండా ఆర్థిక ఆసరా కల్పించాలి.

# ఆకాశ మార్గం పుంజుకుంది వేగం

హైదరాబాద్ : నగరం నుంచి నిర్మించ తలపెట్టిన రెండు మహా రహదారుల నిర్మాణానికి చకచకా అడుగులు పడుతున్నాయి. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే టెండర్ల ప్రక్రియ చేపట్టేందుకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) సిద్ధమవుతోంది. వీలైనంత తొందరగా పనులు ప్రారంభించేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. సికింద్రాబాద్ ప్యారడైజ్ జంక్షన్ నుంచి తాడ్‌బండ్, బోయిన్‌పల్లి, డెయిరీఫాం వరకు 5.32 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ కారిడార్, కంటోన్మెంట్ రాజీవ్ రహదారి నుంచి శామీర్‌పేట్ ఓఆర్ఆర్ వరకు 11.12 కిలోమీటర్ల పొడవుతో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి గతంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఈ పనుల్లో కొంత జాప్యం జరిగింది. తాజాగా వీటికి సంబంధించి పనుల్లో కదలిక షురూ అయింది. కంటోన్మెంట్ ప్రాంతంలోని రాజీవ్ రహదారి, 44వ జాతీయ రహదారుల్లో నిర్మించ తలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్ల కోసం చేపట్టాల్సిన విస్తరణ పనులకు సంబంధించి తాజాగా మార్కింగ్ పనులు ప్రారంభమయ్యాయి. ఈమేరకు హెచ్ఎండీఏ, మిలిటరీ, డిఫెన్స్ ఎస్టేట్స్, కంటోన్మెంట్, రెవెన్యూ శాఖల అధికారులు రంగంలోకి



దిగారు. రహదారికి ఇరువైపులా అటు ఇటు 100 అడుగులు విస్తరించనున్నారు. ఈమేరకు అధికారుల బృందం రోడ్డు మధ్యలోని విభాగిని నుంచి ఇరువైపులా మార్కింగ్ పనులు చేపడుతున్నారు. అదేవిధంగా డబుల్ డెక్కర్ కారిడార్‌కు సంబంధించి ప్యారడైజ్ జంక్షన్ నుంచి తాడ్‌బండ్, బోయిన్‌పల్లి ప్రధాన రహదారిలో మార్కింగ్ పనులు షురూ చేశారు.నగదు రూపంలోనా.. టీడీఆర్ వైపా..?

రాజీవ్ రహదారిలోని జింఖానా మైదానం నుంచి హకీంపేట్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్, తూంకుంట, శామీర్‌పేట ఓఆర్ఆర్ వరకు మొత్తం 11.12 కిలోమీటర్ల మధ్య 300 ప్రైవేటు నిర్మాణాలను గుర్తించారు. అదేవిధంగా డబుల్ డెక్కర్ కారిడార్ నిర్మాణంలో కూడా 200 పైనే ప్రైవేటు ఆస్తులను గుర్తించారు. రాజీవ్ రహదారి, 44వ జాతీయ రహదారుల్లో ఈ రెండు ప్రాజెక్టుల కోసం కేంద్ర ప్రభుత్వం సైతం తమ ఆధీనంలో ఉన్న మిలిటరీ, డిఫెన్స్ ఎస్టేట్స్, కంటోన్మెంట్ బోర్డుకు చెందిన స్థలాలను అప్పగించేందుకు పచ్చజెండా ఊపింది. దీనికితోడు ఆయా రోడ్లకు ఇరువైపులా ఉన్న ప్రైవేటు సముదాయాల యజమానులకు భారీగానే పరిహారం చెల్లించాలి. అయితే పరిహారం నగదు రూపంలో చెల్లిస్తారా...లేదంటే అభివృద్ధి బదలాయింపు హక్కు(టీడీఆర్) ఇస్తారా అనే దానిపై ఇంకా స్పష్టత లేకపోయినప్పటికీ టీడీఆర్‌పైనే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అయితే కంటోన్మెంట్‌లో టీడీఆర్ వర్తించనందున బాధితులకు నగదు చెల్లించాల్సి వస్తే ఏం చేయాలన్న సందిగ్ధంలో ప్రభుత్వం ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ ఇరు కారిడార్లను నిర్మించేందుకు పరిహారంతో కలుపుకొంటే భారీగానే నిధులు అవసరమని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో నిధుల సమీకరణకు ఉన్న వెసులుబాటుపై ఇప్పటికే యంత్రాంగం దృష్టి సారించింది. వారం పది రోజుల్లో దీనిపై పూర్తి స్పష్టత రానుంది.

# ఆస్తి పన్ను వసూళ్లు.. పుర ఉద్యోగులకు బాధ్యత

వికారాబాద్ : జిల్లాలో నాలుగు పురపాలిక సంఘాలున్నాయి. వీటి పరిధిలో ఆస్తి పన్ను వసూళ్లను రెగ్యులర్ ఉద్యోగులతో వసూలు చేయించాలని ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దీనివల్ల వసూళ్లలో అక్రమాలకు చెక్ పడుతుందనేది ప్రభుత్వ యోచన. ఇప్పటి వరకు ఉద్యోగుల కొరత కారణంగా జిల్లాలోని నాలుగు పురపాలికల్లో రెగ్యులర్ ఉద్యోగులతో పాటు ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులతో వసూలు చేయిస్తున్నారు. ఈ ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి.దీంతో వసూళ్ల బాధ్యతను రెగ్యులర్ ఉద్యోగులకు అప్పగించారు.

మార్చి, ఏప్రిల్ నెలల్లోనే అధికం

ఆర్థిక సంవత్సరం ముగింపు నెలలైన మార్చి, ఏప్రిల్‌లో తాత్కాలిక ఉద్యోగుల సేవలను అధికంగా వినియోగించుకుంటున్నారు. పన్ను బకాయిలున్న వారి జాబితా ప్రకారం వారి ఇంటి వద్దకు వెళ్లి పాత, మొండి బకాయిలు సైతం వసూలు చేస్తున్నారు.

ఇతర విభాగాల వారిని నియమిస్తారు

జిల్లాలోని నాలుగు పురపాలికల్లో తాత్కాలిక ఉద్యోగులు సుమారు 600 మంది ఉన్నారు. ఒక్క వికారాబాద్ పురపాలికలోనే 243 మంది ఉద్యోగులున్నారు. పన్ను వసూళ్లకు రెగ్యులర్ ఉద్యోగులు సరిపోయేంత మంది లేరు. ఈ విభాగంలో లేకుంటే ఇతర విభాగాల్లోని వారిని



డిప్యూటేషన్‌పై నియమించుకునే అవకాశం ఉంది. పురపాలక ఉత్తర్వులను అమలు చేస్తూ కమిషనర్లు తగిన చర్యలు తీసుకోవడం ప్రారంభించారు.

జమచేసే క్రమంలో చేతి వాటం

మొత్తం 4 మున్సిపాలిటీల్లో 39,648 నివాసాలు నుంచి సుమారు రూ.10 కోట్ల వరకు ఏటా ఆస్తి పన్ను వసూలు చేస్తున్నారు. దీనికి రెగ్యులర్ బిల్ కలెక్టర్లతో పాటు తాత్కాలిక పద్ధతి నియమించుకున్న బిల్ కలెక్టర్ల సేవలు ఉపయోగిస్తున్నారు. తాత్కాలిక ఉద్యోగులు చేతి యంత్రాలు ద్వారా పన్ను వసూలు చేసి రశీదులు అందజేస్తున్నారు. అనంతరం డబ్బును పురపాలక సంఘ కార్యాలయంలో క్యాష్ కౌంటర్‌లో జమ చేస్తున్నారు. ఈ క్రమంలో కొందరు డబ్బులను పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

# రవాణా కేంద్రాలు.. దళారులు రాజ్యాలు



హైదరాబాద్ : గ్రేటర్‌లోని రవాణాశాఖ కార్యాలయాల వద్ద దళారుల ప్రమేయం మరోసారి తేటతెల్లమైంది. రాష్ట్ర వ్యాప్తంగా అవినీతి నిరోధక శాఖ మంగళవారం చేపట్టిన దాడుల్లో భాగంగా గ్రేటర్‌లోని బండ్లగూడ, మలక్‌పేట్, టోలిచౌకి, మణికొండ కార్యాలయాల్లో దళారుల దందా బయట పడింది. నాలుగు కార్యాలయాల్లో రూ.1.37 లక్షలు లెక్క చూపని నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇదంతా దరఖాస్తుదారుల నుంచి దళారులు వసూలు చేసినట్లు స్పష్టమవుతోంది. ఇలా అన్ని కార్యాలయాల్లో నెలలో రూ.కోట్లలోనే అనధికారిక లావాదేవీలు జరుగుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ ఆర్టీఏలు వాటి పరిధిలో ఉప రవాణాశాఖ కార్యాలయాలు ఉన్నాయి. దాదాపు అన్ని కార్యాలయాల వద్ద దళారుల దందా అనేది బహిరంగ రహస్యమే.

రెట్టింపు ఛార్జీల వసూలు: రిజిస్ట్రేషన్ చేయించడం, వాహన యాజమాన్య హక్కుల మార్పిడి, కొత్త లైసెన్సులు ఇప్పించడం తదితర సేవలకు దళారులు రెట్టింపు ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఇందులో కొంత అక్కడ సిబ్బందికి వాటాలుగా పంపుతున్నారు. ఇలా సాయంత్రానికి ఎవరివి వారికి అందుతుంటాయి. వాస్తవానికి ఆర్టీఏలో 43 రకాల సేవలను ఆన్‌లైన్‌లో పొందే అవకాశం రవాణాశాఖ కల్పించింది. అయితే కొన్ని రకాల సేవలకు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నా కార్యాలయాలకు రావాల్సిందే.

ఏసీబీని చూసి... పర్సు వదిలేశారు..

మలక్‌పేటలోని ఈస్ట్ జోన్ ఆర్టీఏ కార్యాలయంలో సోదాల సందర్భంగా దరఖాస్తుదారులను విచారించి పంపించి వేయగా...15 మంది దళారులను గుర్తించారు. ఉద్యోగుల టేబుళ్లు, డెస్కులు, దస్త్రాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఒక గుర్తు తెలియని పర్సు ఏసీబీకి లభించింది. అందులో రూ.22 వేలు ఉన్నాయి. అనంతరం ఏసీబీ డీఎస్పీ కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆర్టీఏ కార్యాలయంలో పలు అవకతవకలు జరిగాయని గుర్తించామని వివరించారు. పలువురు ఏజెంట్లు, బ్రోకర్లు కార్యాలయంలో ఉన్నారని.. పూర్తిస్థాయిలో విచారించి నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

పరుగో పరుగు...

దాడుల సందర్భంగా పలువురి ఏజెంట్ల వద్ద డబ్బులు పట్టుబడ్డాయి. బండ్లగూడలో రూ.48,370, మలక్‌పేట్‌లో రూ.22 వేలు, టోలిచౌకిలో రూ.43,360, మణికొండలో రూ.23,710 ఏసీబీ స్వాధీనం చేసుకుంది. వినియోగదారుల నుంచి వసూలు చేసి సాయంత్రానికి ఆర్టీఏ అధికారులు, సిబ్బందికి వాటాలు ముట్టజెప్పేందుకు ఉంచిన నగదుగా భావిస్తున్నారు. ఏసీబీ అధికారులు తలుపులు మూసి లోపల ఉన్న వారందరినీ విచారించారు. కౌంటర్ల వద్ద, కార్యాలయంలో ఉన్న నలుగురు ఏజెంట్లను అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ దాడులు తెలుసుకున్న పలువురు ఏజెంట్లు తమ చేతుల్లో ఉన్న దరఖాస్తు ఫారాలను దూరంగా విసిరేసి బయటికి పరుగులు తీశారు. బండ్లగూడలో సిబ్బందిలో ఒకరు పారిపోతుండగా పట్టుకుని విచారించారు. కొందరు సిబ్బంది, అధికారుల వద్ద నగదు ఉన్నట్లు కనుగొన్నారు. కంప్యూటర్లలో నిక్షిప్తమైన వివరాలనూ పరిశీలించారు. ఆర్టీఏ కార్యాలయాల సమీపంలోని డ్రైవింగ్ స్కూళ్లు, జిరాక్సు సెంటర్లను మూసివేశారు.

# కూరగాయల కొరతతో ధరల మోత.. ఒక్కసారిగా రెట్టింపు

హైదరాబాద్: అకాల వర్షాలు.. రబీ–ఖరీఫ్ అంతరంతో కూరగాయల సాగు తగ్గిపోయింది. ఇదే అదనుగా ధరలు అమాంతం పెరిగిపోతున్నాయి.ముందస్తు ప్రణాళికలు ఉన్నా ఆచరణలో విఫలం కావడంతో ప్రజల నడ్డి విరిచేలా భారం పెరుగుతోంది. మొన్నటి దాకా రూ.వందకు 6 కేజీల టమాటా దొరికేది. ఇప్పుడు రైతుబజారులోనే రూ.30 దాటింది. బయట మార్కెట్లో రూ.40–50 ఉంటోంది. ఇక బీన్స్ రూ. 200లు దాటింది. బీర, సొరకాయలు రూ.60కిపైగానే ఉంటున్నాయి.

తగ్గిన సరఫరా జాతీయ పోషకాహార సంస్థ లెక్కల ప్రకారం కనీసం ప్రతి రోజూ ప్రతి ఒక్కరు.. 350 గ్రా. కూరగాయలు తినాలి. ఈ లెక్కన రోజుకు 3300 టన్నులు నగరానికి కూరగాయలు అవసరం.. నగరంలోని అన్ని హోల్‌సేల్ మార్కెట్లకు 2800 టన్నులు మాత్రమే వస్తున్నాయి. ప్రతి రోజూ 5 వేల క్వింటాళ్ల టమాటా వస్తే ధర కాస్త అందుబాటులో ఉంటోంది. ఇప్పుడు 4 వేల క్వింటాళ్లలోపే రావడంతో ధర పెరిగింది. రైతుబజారు ధర ప్రకారం కిలో టమాటా రూ.31.. గుండు బీన్స్ ధర రూ. 155. గింజ చిక్కుడు రూ.85, పచ్చకాకర రూ.55లు, బెండకాయ రూ.45, పచ్చి మిర్చి రూ. 50 ఉంటే..బహిరంగ మార్కెట్‌లో రూ.10–20 అధికంగా ఉంటోంది.

ఖరీఫ్ పంట వస్తేనే..ఖరీఫ్ పంట కాలం జూన్ నెల నుంచి మొదలవుతుంది. వర్షాలు వస్తే కూరగాయల సాగు సాధ్యమవుతుంది. ఆ తర్వాతే కూరగాయల ధరలు తగ్గే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

# విపత్తు వేళ.. పెద్దన్నలా సేవ

హైదరాబాద్ : రాజధానిలో ఎక్కడ, ఎలాంటి ప్రమాదం జరిగినా.. ముందుగా అక్కడికి చేరుకునేది జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్(విపత్తు స్పందన దళం) బృందాలే. జీహెచ్ఎంసీలో భాగమైన ఈవీడీఎం (ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్) కింద 2018లో ఏర్పాటై.. ఆది నుంచే నగరవాసులకు నేనున్నానంటూ భరోసా ఇస్తోంది డీఆర్ఎఫ్. ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఇది పనిచేస్తోంది.కంట్రోల్ రూముకు లేదా సామాజిక మాధ్యమాల ద్వారా అందే ఫిర్యాదులను అధికారులు డీఆర్ఎఫ్, ఈవీడీఎం వాట్సప్ గ్రూపులకు పంపిస్తారు. వెంటనే దగ్గర్లోని వాహనాలన్నీ అక్కడికి చేరుకుని సేవలు ప్రారంభిస్తాయి.

బృందాలు 30

మొత్తం సిబ్బంది 453

రోజుకు మూడు షిఫ్టుల్లో ఏడాది పొడవునా సేవలు

ఇప్పటి వరకు చేపట్టిన సహాయక కార్యక్రమాలు 13,198

కంట్రోల్ రూము నంబర్లు..

9000113667, 040- 2955 5500, 2956 0521, 2956 0528, 2956 0584, 2956 0591




ప్రాణాలు లెక్క చేయకుండా– ఎన్.ప్రకాశ్‌రెడ్డి, డైరెక్టర్, ఈవీడీఎం, జీహెచ్ఎంసీ

కాటేదాన్, జీడిమెట్ల, కాప్రా, ఉప్పల్ పారిశ్రామికవాడల్లో, బోయిగూడ, నాంపల్లి, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లో జరిగిన అగ్ని ప్రమాదాల నుంచి డీఆర్ఎఫ్ సిబ్బంది వందల మందిని రక్షించారు. ఎలాంటి విపత్తునైనా వెనకడుగు వేయకుండా డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగుతాయి. ఏ ప్రమాదాన్ని ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై సిబ్బందికి నాగోల్ ఫతుల్లాగూడలోని శిక్షణ కేంద్రంలో తర్ఫీదు ఇచ్చాం. అక్కడ పాటించే ప్రమాణాలను ఎన్‌డీఆర్ఎఫ్ సైతం మెచ్చుకుంది. సీపీఆర్ చేయడంలోనూ శిక్షణ ఇచ్చాం.

# దర్జాగా.. కాలువల ఆక్రమణ

తాండూరు : సహజ నీటి వనరులైన కాగ్నా నదీ ప్రవాహ కాల్వలు, పట్టణ ప్రాంతాల్లో మురుగు పారేందుకు వీలుగా ఉన్న కాలువలు కబ్జాదారుల కారణంగా కనుమరుగవుతున్నాయి. కొందరు వ్యాపారులు తమ భూములకు అడ్డుగా వస్తున్నాయని దశాబ్దాలుగా నీరు పారేందుకు వీలుగా ఉన్న కాలువలను సైతం మూసేసి పట్టా భూముల్లో కలిపేస్తున్నారు. వెరసి వర్షాకాలంలో వరద పారే వీల్లేక పంట పొలాలు, వీధులు, కాలనీలు, రహదారులు ముంపునకు గురవుతున్నాయి.

వ్యవసాయ భూములకు డిమాండ్

జిల్లాలో ఇటీవల భూముల ధరలు రెండింతలు పెరిగాయి. పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా అన్నిచోట్ల భూముల ధరకుల రెక్కలొచ్చాయి. వ్యవసాయ భూములకు బాగా డిమాండ్ పెరిగింది. దీంతో ఆక్రమణలు సైతం ఎక్కువవుతున్నాయి. ప్రధానంగా చెరువుల శిఖం భూములు, వరద నీరు పారే కాల్వలే లక్ష్యంగా ఆక్రమణలు జరుగుతున్నాయి. పట్టా భూములను ఆనుకొని ఉన్న కాల్వలను తమసొంత స్థలాల్లో కలిపేసుకుంటున్నారు. పక్కనున్న వారు ఫిర్యాదు చేస్తేనే అధికారులు పరిశీలించి చర్యలు చేపడుతున్నారు. లేదంటే కాల్వలు కళ్లముందే కన్పించకుండాపోతున్నాయి. ఇవిగో ఉదాహరణలు

తాండూరు మండలం చంద్రవంచలో ఓ భూస్వామి కాగ్నా నదికి అనుసంధానంగా ఉన్న కాల్వలను అమాంతం తన భూముల్లో కలిపేసుకున్నారు. కాల్వల వద్ద వరదనీటిని ఒడిసి పట్టేందుకు 2017–18 సంవత్సరంలో వాటర్‌షెడ్ అధికారులు రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ఆనకట్టలు ఉనికిని కోల్పోయే దుస్థితి ఏర్పడింది.

సిరిగిరిపేట శివారులో దశాబ్దాలుగా కాల్వ ఉండగా పక్కన పట్టాభూమిని కొనుగోలు చేసిన స్థిరాస్తి వ్యాపారి అమాంతం కాల్వలను



పట్టాభూమిలో కలిపేసుకున్నాడు.

తాండూరు–చించోళి జాతీయ రహదారి వారగా మొత్కు వాడుక పరిసరాల్లో కాల్వలను ఆక్రమించి దుకాణాలు నిర్మించుకున్నారు. కాల్వలు కనుమరుగవడంతో వర్షాకాలంలో చెరువు, వరద నీటితో శ్రీనివాస కాలనీ ముంపునకు గురై స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తోంది.యాలాల మండలం కోకట్ పరిధిలో కొడంగల్ మార్గంలో కాల్వను పూడ్చేసి ఇళ్లు, దుకాణ సముదాయం నిర్మించారు. వరద పారే వీల్లేక ఏటా వర్షాకాలంలో గ్రీన్‌సిటీ, మార్కండేయ కాలనీలు వరదతో నిండి కాలనీవాసులను అసౌకర్యానికి గురిచేస్తోంది. గతేడాది అక్రమ నిర్మాణాలు కూల్చేసి కాల్వల పునరుద్ధరణకు కదిలిన మున్సిపల్ అధికారులు రాజకీయ ఒత్తిళ్లతో వెనుదిరిగారు.

పట్టణ పరిధిలో హైదరాబాద్ రహదారి మార్గంలో కాల్వను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. వర్షాకాలంలో హైదరాబాద్ రహదారిపై మోకాళ్ల దాకా వరదతో రాకపోకలకు అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

విచారించి చర్యలు తీసుకుంటాం

చెరువు నీరు, వరద పారే కాల్వలను ఆక్రమించుకుంటే కఠిన చర్యలు చేపడతాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి విచారణ జరిపేందుకు రెవెన్యూ సిబ్బందిని ఆదేశిస్తాం. కాల్వలపై ఆక్రమణల్ని తొలగింపజేస్తాం. వర్షాకాలంలో వరద సాఫీగా పారేలా కాల్వల పరిరక్షణ అందరి బాధ్యతగా భావించాలి.శ్రీనివాస్‌రావు, ఆర్డీఓ, తాండూరు.




హైదరాబాద్: సంగీతంలో ప్రాంతీయ భేదాన్ని తీసుకురావడం మంచిది కాదని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర గీతానికి సంగీత దర్శకత్వ బాధ్యతలు కీరవాణికి అప్పగించడంపై బీఆర్ఎస్ పార్టీ ప్రాంతీయ వాదాన్ని తీసుకురావడం సరికాదని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో 12 మంది సమైక్యవాదులను మంత్రులుగా పెట్టుకున్నారని విమర్శించారు. ప్రభుత్వ చిహ్నం జోలికి పోకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధిపై దృష్టిసారించాలని సీపీఐ నారాయణ తెలిపారు.

## బెంగళూరులో దిగిన ప్రజ్వల్ రేవణ్ణ.. అరెస్టు చేసిన సిట్ పోలీసులు



బెంగళూరు: పలువురు మహిళలపై లైంగిక దౌర్జన్యానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను బెంగళూరు పోలీసులు గురువారం అర్ధరాత్రి దాటాక అరెస్టు చేశారు. జర్మనీ నుంచి బయలుదేరిన ఆయన బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగిన వెంటనే సిట్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనను భారీభద్రత మధ్య విచారణ నిమిత్తం సీఐడీ కార్యాయానికి తరలించారు. మాజీ ప్రధాని దేవెగౌడ మనవడు అయిన ప్రజ్వల్ రేవణ్ణ.. ఎన్డీయే కూటమి తరఫున హాసన నుంచి ఎంపీగా బరిలోకి దిగారు. పలువురు మహిళలపై ఆయన లైంగిక దాడి చేసినట్లు వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో ఆయన గత ఏప్రిల్‌లో దేశం విడిచి పరారయ్యారు. ఇప్పటివరకు రేవణ్ణపై మూడు కేసులు నమోదు అయ్యాయి. ఆయన జాడ కోసం బెంగళూరు పోలీసులు ముమ్మరంగా గాలించారు. ఆయనపై నాలుగుసార్లు నోటీసులు, ఒక అరెస్టు వారెంటు, బ్లూ కార్నర్, రెడ్ కార్నర్ నోటీసులు జారీ అయ్యాయి. దౌత్య పాస్‌పోర్టు రద్దు చేసేందుకు కేంద్ర విదేశాంగ శాఖ చర్యలు చేపట్టింది. విచారణకు హాజరు కావాలని ఆయన తండ్రి హెచ్‌డీ రేవణ్ణ, మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ బహిరంగానే కోరారు.

ఈ నేపథ్యంలో తనపై నమోదైన కేసుల విచారణకు సహకరిస్తానని, మే 31న 'సిట్' ముందు హాజరవుతానని ఇటీవల తొలిసారి వీడియో సందేశంలో రేవణ్ణ పేర్కొన్నారు. మరోవైపు బెంగళూరు కోర్టులో రేవణ్ణకు ఎదురుదెబ్బ తగిలింది. ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు తిరస్కరించింది.

## మీ పెద్ద కొడుకుగా ఉండి అందరి సమస్యలూ తీరుస్తా



ఖమ్మం: పాలేరు నియోజకవర్గంలో అర్హులైన వారందరికీ ఇళ్ళు ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నేడు ఆయన ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం కొక్కిరేణిలో పర్యటించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. మీ అందరికీ ఇచ్చిన మాట ప్రకారం మీ సమస్యలన్నీ తీరుస్తానన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదవారికి ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదన్నారు. పెన్షన్లు, ఇళ్ల స్థలాలు ఇళ్ళు, గ్రామాల్లో అంతర్గత రహదారులు, రేషన్ కార్డులు ఇస్తామని పొంగులేటి తెలిపారు. ఎన్ని కోట్లు ఖర్చైనా తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూస్తామని స్పష్టం చేశారు. వ్యవసాయానికి కూడా ప్రణాళికలు తయారు చేస్తున్నామని పొంగులేటి తెలిపారు. వచ్చే వానాకాలం పాలేరు రిజర్వాయర్‌లో నీరు లేకపోయినా సాగునీటికి ఇబ్బంది లేకుండా పరిష్కరిస్తామన్నారు. మీ ఇంటి పెద్దకొడుకుగా ఉండి మీ అందరి సమస్యలు తీరుస్తానని హామీ ఇచ్చారు. ఏ ఇబ్బంది వచ్చినా అధైర్య పడవద్దని.. తనకు చెబితే మీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని... మీరు పడిన కష్టానికి ప్రతి ఫలం ఇస్తానని పొంగులేటి స్పష్టం చేశారు.

## మలద్వారంలో కేజీ బంగారం దాచి.. ఎయిర్‌హోస్టెస్ స్మగ్లింగ్

కన్నూర్: దేశంలోకి బంగారం అక్రమ రవాణాను అధికారులు ఎప్పటికప్పుడు అడ్డుకుంటున్నప్పటికీ కొందరు స్మగ్లింగ్ కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. తాజాగా కేరళలో ఓ విమానయాన సంస్థ మహిళా ఉద్యోగి ఈ అక్రమ రవాణాకు యత్నిస్తూ అధికారులకు చిక్కింది. నిందితురాలు తన రహస్య అవయవాల్లో కేజీ బంగారాన్ని దాచినట్లు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు వెల్లడించారు. మూడు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మే 28న మస్కట్ నుంచి కన్నూర్ ఎయిర్‌పోర్టుకు ఓ విమానం చేరుకుంది. అందులో బంగారం స్మగ్లింగ్ చేస్తున్నట్లు డీఆర్ఐ అధికారులకు నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. ఆ విమానంలో ఎయిర్‌హోస్టెస్‌గా ఉన్న సురభి ఖాతూన్ ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు సమాచారం రావడంతో ఆమెను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మలద్వారంలో 960 గ్రాముల బంగారాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం నిందితురాలిని కోర్టులో హాజరుపర్చగా.. న్యాయస్థానం 14 రోజుల కస్టడీ విధించింది. ఆమెను కన్నూర్ మహిళా జైలుకు తరలించారు. ఎయిర్‌లైన్‌కు చెందిన సిబ్బంది ఇలా రహస్య భాగాల్లో బంగారాన్ని స్మగ్లింగ్ చేయడం దేశంలో ఇదే తొలిసారని డీఆర్ఐ వర్గాలు వెల్లడించాయి. గత కొన్నేళ్లుగా కేరళలో ఈ బంగారం స్మగ్లింగ్ వ్యవహారం రాజకీయాలను కుదిపేస్తోంది. ఆ మధ్య రాష్ట్ర ముఖ్యమంత్రిపైనా ఈ ఆరోపణలు రాగా.. ఇటీవల పసిడి అక్రమ రవాణా కేసులో కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ సహాయకుడిని దిల్లీలో అరెస్టు చేయడం చర్చనీయాంశమైంది.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.


సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194




## ఘనంగా రాష్ట్రా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. జూన్2వ తేదీన రాష్ట్ర ద్విశాబ్ది ముంగిపు వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఉదయం, సాయంత్రం ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పోలీసులు రిహార్సల్స్ కూడా చేశారు. ముఖ్య అతిథులు, ప్రజాప్రతినిధులు, ఆహ్వానితులకు ప్రత్యేక లాంజ్ ఏర్పాటు చేశారు. పరేడ్ గ్రౌండ్ మొత్తం డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్‌లతో ముమ్మర తనిఖీలు చేశారు. ఈ వేడుకల ఏర్పాట్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, కలెక్టర్ అనుదీప్, పోలీస్ ఉన్నతాధికారులు పరిశీలించారు. రాష్ట్రా ఆవిర్భావ వేడుకలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నమని సీఎస్ శాంతి కుమారి తెలిపారు. జూన్2న ఉదయం 10 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని సీఎస్ చెప్పారు. ట్యాంక్‌బండ్‌పై 5వేల మందితో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నామని ప్రజలంతా ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనాలని సీఎస్ కోరారు. రేపు సాయంత్రం 5 గంట నుంచి ప్రజలను ట్యాంక్ బండ్‌కు అనుమతిస్తారని తెలిపారు. వేడుకలకు భారీగా ఏర్పాట్లు చేశామని, ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఫైర్‌వర్క్స్, కార్నివాల్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కొత్తగా నియామక పత్రాలు తీసుకున్న వారితో ఓ కార్యక్రమానికి ప్లాన్ చేసినట్లు సీఎస్ శాంతి కుమారి తెలిపారు.

## తెలంగాణలో వేలాది మంది అమరులైంది ఎవరి వల్ల?



హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విటర్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేశారు. " తెలంగాణలో వేలాది మంది అమరులు అయ్యింది ఎవరి వల్ల? అమరులస్థూపం నిర్మించాల్సి వచ్చింది ఎవరివల్ల? 1952 లోనే ఉమ్మడి రాష్ట్రం వద్దని, హైదరాబాద్ స్టేట్ ప్రత్యేక రాష్ట్రంగానే ఉండాలని పోరాటం చేస్తున్న విద్యార్థులపై సిటీ కాలేజీ వద్ద కాల్పులు జరిపి ఆరుగురిని బలిగొన్నది ఎవరు? కాంగ్రెస్ ప్రభుత్వం కాదా? 1969-71 తొలిదశ ఉద్యమంలో 370 మంది తెలంగాణ బిడ్డల్ని కాల్చి చంపింది ఎవరు? కాంగ్రెస్ ప్రభుత్వం" అని పేర్కొన్నారు. 1971 పార్లమెంట్ ఎన్నికల్లో 11/14 సీట్లలో తెలంగాణ ప్రజాసమితి పార్టీని గెలిపిస్తే ఆ పార్టీని మాయం చేసింది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనని కేటీఆర్ అన్నారు.

దేశంలో ఎక్కడలేని విధంగా ప్రజాస్వామికంగా, తమ ఆకాంక్షను వ్యక్తం చేస్తే, తెలంగాణను తుంగలో తొక్కింది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. 2004లో మాట ఇచ్చి, పదేళ్ల తాత్సారం చేసి వందలాది తెలంగాణ బిడ్డలు ఆత్మ బలిదానం చేసుకునే దుస్థితికి కారణం కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా చెప్పినట్టు, వేలాది తెలంగాణ బిడ్డలను చంపిన బలిదేవత ఎవరని కేటీఆర్ ప్రశ్నించారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలి: భాజపా ఎంపీ లక్ష్మణ్




హైదరాబాద్: తాను కూడా ఫోన్ ట్యాపింగ్ బాధితుడినని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి.. ఆ కేసు దర్యాప్తునకు మీనమేషాలు ఎందుకు లెక్కిస్తున్నారని భాజపా ఎంపీ లక్ష్మణ్ ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ నేతలు ధర్నాచౌక్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడారు. అధికారాన్ని శాశ్వత పరుచుకునేందుకు నిఘా వ్యవస్థను భారాస అధినేత కేసీఆర్ దుర్వినియోగం చేశారని ఆయన ఆరోపించారు. ఉప ఎన్నికల్లో ఓటర్లను కొనుగోలు చేసేందుకు, ప్రత్యర్థులను దెబ్బ కొట్టడానికి ఫోన్ ట్యాపింగ్ వాడారన్నారు. టెలికాం రెగ్యులేటరీ చట్టానికి భిన్నంగా, కేంద్రం అనుమతి లేకుండా గత ప్రభుత్వం కుట్ర చేసిందని ఆరోపించారు. "కాంగ్రెస్ అధిష్ఠానంతో కేసీఆర్ లోపాయికారీ ఒప్పందం చేసుకున్నారనే అనుమానం కలుగుతోంది. దోషులకు శిక్ష పడేవరకు భాజపా రాజకీయ, న్యాయ పోరాటం చేస్తుది. తెలంగాణ చరిత్రలో రేవంత్ రెడ్డి చరిత్రహీనుడిగా మిగిలిపోకుండా ఉండాలంటే ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలి. భాజపా నేత బీఎల్ సంతోష్‌పై భారాస ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టింది. మద్యం కేసు నుంచి కవితను తప్పించడం కోసమే భాజపా నేతలపై కేసులు పెట్టడం దుర్మార్గం" అని లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం, ధరణిలో జరిగిన అవినీతిపైనా సీఎం రేవంత్‌రెడ్డి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు.

## అందరితో చర్చించే సీఎం రేవంత్ నిర్ణయాలు: ఎమ్మెల్సీ మహేశకుమార్ గౌడ్




హైదరాబాద్: తెలంగాణలో ప్రజల ఆకాంక్షల మేరకే ప్రభుత్వ పాలన ఉంటుందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. భారాస అధినేత కేసీఆర్, కేటీఆర్‌ను ప్రజలు నమ్మేస్థితిలో లేరని చెప్పారు. రాష్ట్ర చిహ్నంలో అమరువీరుల స్థూపం ఉంటే కేటీఆర్‌కు అభ్యంతరం ఎందుకని ప్రశ్నించారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు కేసీఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానిస్తోందని తెలిపారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడారు. "భారాస పదేళ్ల పాలనలో కేసీఆర్ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారా?రాష్ట్రంలో నియంత పాలన ఉండదు. అందరితో చర్చించిన తర్వాతే సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రజల కోరిక మేరకు రాష్ట్ర చిహ్నంలో మార్పులు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. లోటుపాట్లు, అభ్యంతరాలు లేకుండా చిహ్నం రూపొందించేందుకు కసరత్తు చేస్తోంది. అన్నీ తానే అన్నట్లు ప్రజల్లో కేసీఆర్ భ్రమలు కల్పించారు. తనకు తాను చక్రవర్తిగా వ్యవహరించారు. ఆవిర్భావ దినోత్సవానికి అమరవీరుల కుటుంబాలను పిలిచి సముచితస్థాయిలో సత్కరిస్తాం. తెలంగాణ కోసం త్యాగాలు చేసిన అందరికీ గౌరవం దక్కాలని మా ప్రభుత్వం భావిస్తోంది. ఉద్యమంలో పాల్గొన్న అందరికీ ఆహ్వానం ఉంటుంది'' అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

## రూ. 200 కోట్ల స్కామ్.. నిమ్మగడ్డ వాణి బాల అరెస్ట్..

హైదరాబాద్: డిపాజిట్ల పేరుతో రూ.200 కోట్లకు కుచ్చుటోపి పెట్టిన కేసులో ప్రధాన నిందితురాలు తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ బ్యాంక్ జనరల్ మేనేజర్ నిమ్మగడ్డ వాణి బాలను హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఆమె భర్త మెకా నేతాజీతో పాటు అతని కుమారుడు శ్రీ హర్షను కూడా అరెస్ట్ చేశారు. తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ బ్యాంకులో పనిచేసే 140 మంది ఉద్యోగులను వాణి బాల మోసం చేశారు. ఆమె మాటలు నమ్మిన ఉద్యోగులు 26 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టారు. ఈ డబ్బు మొత్తాన్ని వాణి బాలకు చెందిన ప్రియాంక ఎంటర్ ప్రైజెస్‌లో డిపాజిట్ చేశారు. శ్రీ ప్రియాంక ఎంటర్ ప్రైజెస్ పేరుతో అబిడ్స్‌లోని తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ బ్యాంక్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న నిమ్మగడ్డ వాణి బాల సుమారు 532 మంది నుంచి డిపాజిట్లు వసూలు చేశారు. ఆమె భర్త మేక నేతాజీ, కొడుకు మేక శ్రీహర్షలు డిపాజిట్ల సేకరణ చేశారు. నెలకు 24 శాతం రిటర్న్ ఇస్తామని నమ్మబలికారు. మొత్తం 532 మంది నుంచి డిపాజిట్లు వసూలు చేసి ఆ డబ్బులు తీసుకొని పరార్ అయ్యారు. దీంతో వాణి బాలను ఉద్యోగం నుంచి సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. విషయం బయట పడడంతో బాధితులు తమకు న్యాయం చేయాలని కోరుతూ సీసీస్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో వాణి బాల చిట్ ఫండ్ కంపెనీ, శ్రీ ప్రియాంక ఎంటర్ ప్రైజెస్‌పై పోలీసులు కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేపట్టారు. సుమారు రూ. 200 కోట్ల స్కామ్ జరిగినట్లు గుర్తించారు. ప్రధాన నిందితురాలు నిమ్మగడ్డ వాణిబాలతో పాటు ఆమె భర్త, కొడుకును అరెస్ట్ చేశారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660